## కోవిడ్ వ్యాక్సిన్ వికటించి.. పారిశుధ్య కార్మికుడు మరణం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

కోవిడ్ వ్యాక్సిన్ వికటించి ఓ పారిశుధ్య కార్మికుడు మరణించాడు. చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన పారిశుధ్య కార్మికుడు కృష్ణయ్య (49) మంగళవారం వ్యాక్సిన్ తీసుకున్నాడు. బుధవారం కళ్లు తిరిగి స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృష్ణయ్యకు బిపి, షుగర్, పక్షవాతం ఉన్నాయని తెలిపారు. వ్యాక్సిన్ వద్దన్నా బలవంతంగా వేశారని మృతుని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ విషయమై డిఎంహెచ్ఒ పెంచలయ్య మాట్లాడుతూ.. కృష్ణయ్య గుండెపోటుతో మరణించాడే తప్ప, వ్యాక్సిన్ వికటించి కాదని తెలిపారు.

## విద్యుద్ఘాతానికి రైతు బలి

**ప్రజాశక్తి - రాజుపాలెం (గుంటూరు జిల్లా)**

విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన గుంటూరు జిల్లా రాజుపాలెం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. అనుపాలెం గ్రామానికి చెందిన రైతు గోగుల వెంకటేశ్వర్లు (42) నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ చేయగా విద్యుత్ షాక్‌కు గురవ్వడంతో మరణించాడు. గమనించిన రైతులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# 'ఉక్కు' ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

### కార్మిక సంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు

**ప్రజాశక్తి - యంత్రాంగం**


అనంతపురంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎవి.నాగేశ్వరరావు

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని కార్మిక సంఘాల నేతలు ఉద్ఘాటించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రంలోని పలుచోట్ల కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు.

అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వైసిపి ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎ.వి.నాగేశ్వర రావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి నిరుద్యోగ సమస్యను తీవ్రతరం చేస్తోందన్నారు. లాభాల్లో ఉన్న బిఎస్‌ఎన్‌ఎల్, ఎల్ఐసి, బిపిఎల్, బ్యాకింగ్ వంటి అనేక సంస్థలను బడాబాబులకు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తోందని, ఈ చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉందన్నారు.




కడప కలెక్టరేట్ వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఎఐసిసిటియు, హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని కలెక్టరేట్ వద్ద కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. భీమవరంలో అఖిలపక్షాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. పెంటపాడులో సిపిఎం, సిపిఐ, టిడిపి జనసేన, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో కార్మిక సంఘాలు, జంగారెడ్డిగూడెంలోని బోసుబొమ్మ సెంటర్లో ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు.

విజయనగరం జిల్లా పార్వతీపురంలో సిపిఎం, సిపిఐ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన, సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన సాలూరు పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఇఫ్టు ఆధ్వర్యాన నెల్లిమర్లలో నిరసన తెలిపారు.

శ్రీకాకుళం పట్టణంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు, మీ త్యాగాలు వృథా కానివ్వం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 18న నిరవధిక దీక్షలు చేపట్టనున్నట్లు కార్మిక, ఉద్యోగ, పాత్రికేయ, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు.

ప్రకాశం జిల్లా ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి జిల్లాలో ఆందోళనలు చేపట్టాలని తీర్మానించారు.

గుంటూరు కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంగళగిరిలో సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. సత్తెనపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో, తాడేపల్లి సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. గుంటూరులోని గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడారు.



## గుణదల ఉత్సవాలకు యాత్రికుల రద్దీ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

విజయవాడ గుణదలలోని మేరీమాత ఉత్సవాలు రెండోరోజు బుధవారం కొనసాగాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఉత్సవాలను నెల్లూరు కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ మోజెస్ దోరబోయిన ప్రకాశం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుణదల మేరీమాత ఆలయానికి దేశంలోనే అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఇక్కడ ఏటేటా ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందించారు.



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ట్రాన్స్‌పోర్టు సంఘాల నాయకులు, డ్రైవర్లు

## తిరుపతి నుంచి ఇంటర్నేషనల్ సర్వీసుల ప్రారంభం

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇంటర్నేషనల్ సర్వీసులు ప్రారంభించే నిర్ణయం కమర్షియల్ విమానయాన సంస్థలకే ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. తిరుపతి నుంచి ఎయిర్ కార్గో సర్వీసులు భద్రతా అనుమతులు వచ్చిన తర్వాత ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. దేశంలో 7 నూతన గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయ అంగీకారాన్ని తెలిపిందని, అందులో ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉందన్నారు. టిడిపి కనకమేడల రవీంద్ర కుమార్, బిజెపి ఎంపిలు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేశ్, టిఆర్ఎస్ ఎంపి బండ ప్రకాశ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ రమంత్రి సమాధానం ఇచ్చారు.

**ఏపికి రూ.1119 కోట్ల వరద సహాయం**

వరద ప్రభావిత ప్రాంతాల సహాయం కోసం ఎన్‌డిఆర్ఎఫ్ నిధుల నుంచి రాష్ట్రానికి రూ.1,236.66 కోట్లు ఆర్థిక సహాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్ 11న లేఖ రాసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. అయితే కేంద్రం తన వాటాగా రూ.1,119 కోట్లు అడ్వాన్స్‌గా విడుదల చేశామని బిజెపి ఎంపి టిజి వెంకటేశ్ ప్రశ్నకు రాజ్యసభలో కేంద్ రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## పార్లమెంట్‌లో మోడీ మొసలి కన్నీరు

### వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలి : నారాయణ

**ప్రజాశక్తి - కడపఅర్బన్**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కార్పొరేట్ కంపెనీలకు చేయాల్సిందంతా చేసి పార్లమెంట్‌లో మొసలి కన్నీరు కార్చారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. కడపలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ నాయకుల వేషాలు వేసుకుంటూ ప్రజల ఆలోచన విధానాలను పక్కదారి పట్టించేలా నిరంతరం ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన వ్యవహారం నెమలి నాట్యం చేస్తుంటే కాకి ఇకిలించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ముస్లిములంటే పడని మోడీ, కాంగ్రెస్ నాయకులు గులాంనబీ ఆజాద్‌ను కాకా పట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రైతు సంఘాలు కోరుతున్న మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయకుండా చర్చలు నిర్వహించడం వల్ల ఫలితం లేదన్నారు. రైతులను కార్పొరేట్ కంపెనీలకు బాంచన్ నీకాళ్లు మొక్కుతా అనే విధంగా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సిపిఐ చిత్తూరు, కడప జిల్లా కార్యదర్శులు రామానాయుడు, ఈశ్వరయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్ర పాల్గొన్నారు.

## 'ఉక్కు' పోరాటానికి ఢిల్లీ తెలుగు కార్మికుల మద్దతు

- ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : పుణ్యవతి డిమాండ్

**ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో**

వైజాగ్ స్టీల్ ప్రయివేటీకరణను అడ్డుకునేందుకు కొనసాగుతున్న ఉద్యమానికి ఢిల్లీలో పని చేస్తున్న తెలుగు కార్మికులు మద్దతు ప్రకటించారు. ఢిల్లీ ఘజీయాబాద్ సమీపంలోని జెండాపూర్‌లో తెలుగు కార్మికులు పనిచేస్తున్న పలు పారిశ్రామిక వాడల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి బుధవారం నాడు పర్యటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 'శాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు మహోద్యమం' గురించి ఈ సందర్భంగా ఆమె వారికి వివరించారు. ప్రయివేటీకరణతో ఉద్యోగుల జీవితాలకే ప్రమాదమేర్పడుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి తమ మద్దతు కూడా ఉంటుందని ఈ సందర్భంగా అక్కడి తెలుగు కార్మికులు ప్రకటించారు. 1970 తరువాత తామంతా ఆంధ్రా నుంచి ఢిల్లీకి వచ్చామన్నారు. ఎక్కుమ మంది శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చామని వివరించారు. కార్మికులను కలిసిన వారిలో ఢిల్లీ సిపిఎం కమిటీ కార్యదర్శి కెఎన్ తివారి, తెలుగు కార్మికులు డి లోక్‌నాత్, దామోదర్, పరమేశ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## 'పెట్రో' ధరల పెంపును నిరసిస్తూ ఆందోళనలు

**ప్రజాశక్తి-యంత్రాంగం**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుదలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన బుధవారం పలు చోట్ల ఆందోళనలు నిర్వహించారు. పెట్రో ధరల పెంపును వెంటనే ఉపసంహరించాలని, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని పెద్ద ఎత్తున నినదించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ట్రాన్స్‌పోర్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, యానాం-ద్రాక్షారామం రహదరిపై ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లు రాస్తారోకో చేశారు. విజయనగరం పట్టణంలోని మయూరి జంక్షన్‌లో చేపట్టిన నిరసనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టం రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు మెడకు ఉరితాడులా ఉందని, వెంటనే మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కడపలో సిఐటియు, ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆటోకు తాడు కట్టి లాగుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. విశాఖపట్నంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ మోటార్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్( సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా చేశారు.

# గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు రద్దు

- ఐదేళ్లలో రెట్టింపు అప్పుల జారీ లక్ష్యం
- మార్కెట్ కంటే చౌక వడ్డీ రేట్లు
- ఎస్‌బిఐ ఛైర్మన్ వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) గృహ రుణ గ్రహీతలకు బంఫర్ ఆఫర్ ప్రకటించింది. 2021 మార్చి 31 వరకూ గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ విభాగంలో ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల మార్క్ వ్యాపారాన్ని చేరుకున్నట్లు వెల్లడించింది. 2024 కల్లా దీనిని రూ.7 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగానే అతి తక్కువ వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజు మాఫీ లాంటి ఆఫర్లు ఇస్తోన్నట్లు ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ తెలి పింది. ప్రస్తుతం గృహ రుణ మార్కెట్‌లో 34 శాతం వాటాను కలిగి ఉంది. అత్యంత పోటీ పద్దతిలో చౌక వడ్డీ రేట్లతో గృహ రుణాలు అందిస్తోన్న ఎస్‌బిఐ వచ్చే ఐదేళ్లలో ఈ పోర్టు పోలియోలో రెట్టింపు వ్యాపారాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది.

ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేయడంతో పాటుగా ఏడాదికి కనిష్ఠంగా 6.8 శాతం వడ్డీతో గృహ రుణాలు ఇస్తోన్నట్లు ఎస్‌బిఐ వెల్లడించింది. సాధారణ గృహ రుణాలతో పాటుగా ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎస్‌బిఐ ప్రివిలెజ్ హోంలోన్, ఆర్మీ, రక్షణ రంగ సిబ్బందికి ఎస్‌బిఐ శౌర్య హోంలోన్‌లతో పాటు ఎస్‌బిఐ స్మార్ట్‌హోమ్, ఎస్‌బిఐ ఎన్‌ఆర్ఐ హోంలోన్ తదితర వాటితో ఖాతాదారులను ఆకర్షిస్తోననట్లు పేర్కొంది. సగటున రోజుకు వెయ్యి మందికి ఈ రుణాలు మంజూరు చేస్తోన్నట్లు వెల్లడించింది.

**యువతనే ఎక్కువ..**

మార్కెట్‌లో పోటీ పెరుగుతోన్న నేపథ్యంలో తాము కూడా తమ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నామని




ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ కుమార్ ఖార తెలిపారు. పోటీతత్వ రేట్లతో క్షేత్ర స్థాయిలో తమ రుణ జారీలను పెంచుకుంటున్నామన్నారు. మరింత వేగంగా తాము ఈ విభాగంలో ఎదుగనున్నామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. చాలా మంది యువత సొంత ఇళ్లకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. తమ ఖాతాదారుల్లో 42 శాతం మంది కూడా 40 ఏళ్లలోపు వారేనన్నారు.

**మొండి బాకీల బెడద లేదు..**

ఎస్‌బిఐ గృహ రుణాల్లో కేవలం 0.68 శాతం మాత్రమే మొండి బాకీలుగా ఉన్నాయన్నారు. కోవిడ్ ప్యాకేజీలో 39 లక్షల మంది రుణాల పునర్వ్యవస్థీకరణకు అర్హులుగా ఉన్నప్పటికీ.. కేవలం 10,000 మంది మాత్రమే దీన్ని ఎంచుకున్నారని దినేష్ కుమార్ ఖార తెలిపారు. ఈ రుణాల మొత్తం విలువ కూడా రూ.2,500 కోట్లుగా ఉందన్నారు. ఈ రెండు అంశాలు తమ రుణ పుస్తక నాణ్యతను నిరూపిస్తున్నాయన్నారు. ఒక్కో గృహ రుణ విలువ సగటున రూ.31 లక్షలుగా ఉందన్నారు. ఇంతక్రితం ఇది రూ.25 లక్షలుగా ఉందన్నారు. మొత్తం రుణాల్లో పట్టణ, చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల వాటా 51-52 శాతంగా ఉందని, మిగితా మొత్తం మెట్రో నగరలదేనని అన్నారు. తమ మొత్తం గృహ రుణ ఖాతాదారుల్లో 72 శాతం వేతన జీవులేనని తెలిపారు. మరీ ముఖ్యంగా 60 శాతం రుణ గ్రహీతల క్రెడిట్ స్కోర్ కనీసం 750గా ఉందన్నారు.

## హింద్‌వేర్ నూతన ప్రచారం

**న్యూఢిల్లీ :** ప్రముఖ బాత్‌వేర్ బ్రాండ్ హింద్‌వేర్ తమ ఉత్పత్తుల ప్రచారానికి నూతన క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. దీనిలో వినియోగదారులకు పనితీరుపరంగా అత్యున్నత ప్రదర్శన కనబరుస్తూనే, ఆలోచనాత్మక ఉత్పత్తులను అందించే ప్రయత్నాలను ప్రదర్శించినట్లు బ్రిల్లోకా లిమిటెడ్ సిఇఒ సుధాంషు పోఖ్రియాల్ పేర్కొన్నారు.

## గెయిల్ ఇండియాకు రూ.1,897 కోట్ల లాభాలు

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో గెయిల్ ఇండియా 6.5 శాతం తగ్గుదలతో రూ.1,897.04 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. 2019-20 ఇదే త్రైమాసికంలో రూ.2,029.51 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.18,094.15 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో 12 శాతం తగ్గి రూ.15,899.85 కోట్లకు పరిమితమయ్యింది. సహజ వాయువు మార్కెటింగ్ రెవెన్యూలో 13 శాతం తగ్గుదల చోటు చేసుకోవడంతో ఆ ప్రభావం లాభాలపై పడిందని గెయిల్ తెలిపింది. అయితే 2020 సెప్టెంబర్ త్రైమాసికం ఫలితాలతో పోల్చితే క్రితం క్యూ3లో మెరుగైన ప్రగతిని కనబర్చినట్లు పేర్కొంది.

## బడాబాబులకు రుణాలివ్వం..! : యెస్ బ్యాంక్ సిఇఒ

**న్యూఢిల్లీ :** తాము ఇప్పట్లో బడా కార్పొరేట్ వ్యాపారులకు రుణాలు ఇవ్వకుండా దూరంగా ఉండాలనుకుంటున్నామని యెస్ బ్యాంక్ సిఇఒ ప్రశాంత్ కుమార్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. మధ్యస్థ, చిన్న కార్పొరేట్ సెగ్మెంట్‌లో పునర్‌నిర్మాణంపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఇప్పటికే కార్పొరేట్, రిటైల్ రుణాల మొండి బాకీలు తీవ్ర స్థాయికి పెరగడంతో ఆస్తుల నాణ్యతపై ఆందోళన నెలకొందన్నారు. ఈ గాయాల నుంచి బయటపడుతున్నామన్నారు.

## శీతల పానియాల కంపెనీలకు రూ.72 కోట్ల జరిమానా

**ముంబయి :** మూడు బహుళజాతి శీతల పానియాల కంపెనీలకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) జరిమానా విధించింది. కోక్, పెప్సీ, బిస్లేరీ కంపెనీల నుంచి బయటకు వస్తున్న ప్లాస్టిక్ బ్యాగులు, బాటిళ్ల సేకరణకు సంబంధించి సమాచారం ఇవ్వకపోవడంపై ఆయా కంపెనీలపై దాదాపు రూ.72 కోట్ల జరిమానా విధించింది. బిస్లేరీ సంస్థకు రూ.10.75 కోట్లు, పెప్సీ కంపెనీకి రూ.8.7 కోట్లు, కోకాకోలా కంపెనీకి రూ.50.66 కోట్ల జరిమానా వేశారు. ఇదే సమయంలో రాందేవ్ బాబాకు చెందిన పతంజలి సంస్థకు రూ.1 కోటి చొప్పున జరిమానా విధించగా.. ఈ మొత్తాలను 15 రోజుల్లోగా చెల్లించాలని సిపిసిబి ఆదేశాలు జారీ చేసింది.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

**Laurus Labs Limited**

**Registered Office:** Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531021, Andhra Pradesh
**Corporate Office:** 2nd Floor, Serene Chambers, Road No.7, Banjara Hills, Hyderabad - 500 034, Telangana
**Phone:** +91 40 3980 4333; **Fax:** +91 40 3980 4320 | **Email:** secretarial@lauruslabs.com; **Website:** www.lauruslabs.com
**Corporate Identity Number: L24239AP2005PLC047518**

**NOTICE**

Further to the 'Notice of Record Date' dated January 29, 2021 by the Company pursuant to the declaration of 2ndInterim Dividend of 0.40 Paise per share of face value of Rs. 2/- each for FY 2020-21 with a 'Record Date' as 'February 09, 2021, it is hereby informed to the shareholders that the Income Tax Act, 1961 (Act), as amended by the Finance Act 2020, mandates that dividends paid or distributed by Company after April 01, 2020 for Rs. 5,000/- in aggregate in a Financial Year or more shall be taxable in the hands of shareholders and the Company is required to deduct tax at source(TDS) from dividend paid to shareholders in accordance with the provisions of the Act.

The prescribed rates of TDS for various categories and the procedure for declarations are as follows:

**i) Resident Shareholder:**

| Particulars | TDS Rate |
|---|---|
| With PAN | 7.5% or as may be notified by the Government of India |
| Without/Invalid PAN | 20% or as may be notified by the Government of India |
| Submission of declaration in Form 15G or Form 15H | NIL |

For the above purpose, the shareholders are requested to update their PAN with the Company/RTA (in case of shares held in physical mode) and depository participants (in case of shares held in demat mode) to get the benefit of Lower TDS rate and to enable the Company to provide the TDS Certificates to the shareholders.

**ii) Non-Resident Shareholder:**

TDS Rate @20% plus applicable surcharge and Cess(OR) applicable Tax Treaty Rate under the Double Tax Avoidance treaty (DTAA) between India and their country of residence (whichever is lower), subject to the fulfillment of the following requirements:

The Non-resident shareholders are requested to provide the following documents to avail the tax treaty benefits by sending an email tosecretarial@lauruslabs.com and einward.ris@kfintech.com on or before February 14, 2021:

- Declaration for "No Permanent Establishment" in India;
- Beneficial Ownership Declaration;
- Tax Residency Certificate (TRC) for FY 2020-21;
- Form 10F and
- Copy of Indian PAN (if available).

The above documents shall be e-mailed **on or before February 14, 2021** to secretarial@lauruslabs.com and einward.ris@kfintech.com with subject line: **(Unit-Laurus Labs Limited TDS Exemption Documents).**

Further, the shareholders whose email ids for all communications AND / OR Bank Account details for receipt of Dividend amount directly to the Bank Accounts, are not registered with their Depository Participants are hereby requested to register/update their email ids and Bank Account details with their respective Depository Participants.

For **Laurus Labs Limited**

Place: Hyderabad
Date: February 10, 2021

Sd/- **G. Venkateswar Reddy**
Company Secretary